ఆ వూరికి సూరయ్య నాలుగుసార్లు నుంచీ సర్పంచ్‌గా వుంటూ వస్తున్నాడు.

సూరయ్య, సామాన్యమైనవాడు కాదు. అసాధారణ రాజకీయ పరిజ్ఞానం వున్నవాడు; వూరంతటికీ చెన్నకేశవ దేవాలయ గోపురం ఎత్తయింది అయితే, దానికంటే ఎత్తుగల మేడ కట్టిన మోతుబరి రైతు. సూరయ్య తాతగానీ, ముత్తాతగానీ అంతగా వున్నవాళ్లు కాదు. వాళ్లు నీతికి నిలబడి నీళ్లు తాగారు కానీ, పరుగెత్తి పాలుగానీ, బీరుగానీ తాగలేదు. చేతికి ఎక్కువ కాకుండా దానధర్మాలు చేశారు గానీ, పరాయి చేతుల్ని కూడా సొంతం చేసుకొని సంపాయించలేదు. సూరయ్య ధాన్యం కమీషన్ వ్యాపారం చేశాడు: చెన్నకేశవ ఆలయానికి మేనేజింగ్ ట్రస్టీగా ఉన్నాడు; బావమర్దిచేత ఎరువుల వ్యాపారం పెట్టించాడు; తమ్ముడిచేత కాంట్రాక్టు పనులు చేయించాడు: అన్నిటినీ మించి తాకట్టు పెట్టుకొని వడ్డీ వ్యాపారం ఇప్పటికీ చేస్తూనే వున్నాడు. గ్రామాభివృద్ధికి ఎంతో పాటుపడిన మాట వాస్తవమే. ఊరంతటికీ మంచి రోడ్లు వేయించాడు. వీధులన్నిటికీ విద్యుద్దీపాలు పెట్టించాడు. మురుగు నీటి కాల్వలు పకడబందీగా బాగుచేయించాడు. హరిజనవాడ అభివృద్ధికి ఎన్నో చర్యలు తీసుకున్నాడు. ఊరి చెరువు బాగుచేయించాడు. రెండో నెంబరు బ్రాంచి కెనాల్‌పైన వంతెన కట్టించాడు. ఊళ్లో చందాలు పోగుచేసి అరవై అడుగుల ఎత్తుమేరకు రథశాలను పెద్దవాళ్ళతో కట్టించాడు. ఊళ్లో అయిదారు చోట్ల రేడియో గదులు ఏర్పాటు చేయించాడు. ఎం. ఎల్. ఏ. తోనూ, కలెక్టరుతోనూ మాట్లాడి వూళ్లో ఉన్నత పాఠశాల పెట్టించాడు. విద్యాశాఖామంత్రిని పిలిపించి దానికి ప్రారంభోత్సవం చేయించి, సామూహిక విందు భోజనం ఏర్పాటు చేయించి, ఊరందరిచేతా చేతులు కడిగించాడు. మరంతే కాకుండా ఊళ్లో లోకల్ డిస్పెన్సరీ రావడానికి, హెల్త్ సెంటరు పెట్టడానికీ, ఎల్. ఎల్. ఏ. వారి లైబ్రరీ స్థాపించడానికీ, మంచినీటి పథకం అమలు జరపడానికీ, పంచాయతీ బోర్డుకు సొంత భవనం నిర్మించడానికీ, మార్కెట్ యార్డు లైసెన్సు తెప్పించ

దానికీ, ఇలాంటి ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలకు సర్పంచ్ సూరయ్యే మూల కారకుడు. ఊరి జనమంతా దాదాపు సూరయ్య పేరు మర్చిపోయారు. బీదాబిక్కీ దగ్గర్నుంచి చిన్నాపెద్దా దాకా అందరూ 'సర్పంచ్' అనే పిలవటానికి అలవాటు పడ్డారు.

ఆ వూరికి మొదటిసారి పంచాయతీ ప్రెసిడెంట్ అయిన దగ్గర్నుంచీ, నాలుగో టరమ్ అయిపోవస్తూన్న నాటికి సూరయ్య దొరవారి చెరువు పక్కనున్న నాలుగు తరాల మర్రిచెట్టులాగా వూడలు దించుకొని అన్ని విధాల విస్తరించిపోయాడు. పాతికెకరాల పొలం కొన్నాడు; మూడంతస్తుల మేడ కట్టాడు; లక్ష యాభై వేలు డొనేషన్ చెల్లించి కొడుక్కి బెంగుళూరులో మెడిసిన్ సీటు కొన్నాడు; పదెకరాల పొలమూ, లక్ష రూపాయల రొక్కమూ, రెండొందల యాభై నవర్సల బంగారు నగలూ ఇచ్చి కూతురికి వైభవోపేతంగా పెళ్ళిచేశాడు. ఎంబాసడర్ కారు కొన్నాడు; ఆ కారులో నెలకోసారి ఇద్దరు ముగ్గుర్ని వేసుకొని మంత్రులతో పనులమీద హైద్రాబాదు వెళ్ళి వస్తుంటాడు; లక్షలకొద్దీ డబ్బును వడ్డీ వ్యాపారం మీద తిప్పుతూ వుంటాడు. సూరయ్య ఎప్పుడూ పేటంచు పొందూరు ఖాదీ ధోవతీ, గోధుమ రంగు ఖాదీ సిల్కు లాల్చీ, బిళ్ళమడత కండువా తప్ప ధరించడు.

పంచాయతీ బోర్డు మెంబర్లందరూ మర్రిచెట్టుకింద మొలిచి, ఎదగడం మానివేసిన మొక్కల్లా ఆయన కింద ఉంటారు. అయితే తన నీడలో వారికి ఆశ్రయమిచ్చి, తృణమో పణమో బాగుపడేట్టు వాళ్ళకి ఏర్పాటు చేస్తూవుంటాడు. అందుచేత వాళ్ళంతా నమ్మిన బంట్లులాగా వ్యవహరిస్తూ వుంటారు.

అట్లాంటి సూరయ్యను వచ్చే పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా రానివ్వకుండా చేయాలని వూళ్లో కుర్రకారంతా నిర్ణయించుకున్నారు. బి. ఎ. పొలిటిక్స్ ప్యాసై, ఊళ్లో ఖాళీగా వుంటున్న వరప్రసాదును సర్పంచ్‌గా చెయ్యాలని అన్ని కులాలకు చెందిన యువజనులందరూ ఏకగ్రీవంగా నిర్ణయించుకొని, ఎన్నికల్లో పోరాడటానికి దృఢంగా సంకల్పించుకొన్నారు. ఆ విషయం సూరయ్యకు తెల్సి, గంభీరంగా చిరునవ్వు నవ్వుకొని, బట్టతల సవరించుకొంటూ-"తలమీద వెంట్రుకలు రాలినవాళ్ళకు గానీ రాజకీయాలు, తల దువ్వుకోవడం మీద మోజున్న వాళ్ళకు కాదు" అనుకున్నాడు.

పంచాయతీ బోర్డుకు ఎన్నికలు జరిగాయి. సూరయ్య తరుపున మెంబర్లు నిలబడ్డారు. వరప్రసాద్ తరుపున మెంబర్లు నిలబడ్డారు. సూరయ్య అధ్వర్యంలో




గుళ్లో తీర్థంలా గ డబ్బు ఖర్చయింది. వరప్రసాద్ అధ్వర్యంలో నినాదాలు, ఉపన్యాసాలు వీధివీధినా మారుమ్రోగిపోయాయి. 'ఎన్నికల్లో ఎవరు నెగ్గుతారా?' అన్నంత ఉద్రిక్తతగా ఉత్కంఠతగా ఎన్నికలు ముగిశాయి.

అయితే సూరయ్య తరపున నిలబడ్డ మెంబర్లంతా కొద్దో గొప్పో మెజారటీతో గెల్చారు. సూరయ్యతో ముఖాముఖీ పోటీచేసిన వరప్రసాద్ ఓడిపోయాడు.

ఎన్నికల్లో తాము చిత్తుగా ఓడిపోవడంతో కుర్రకారు దిమ్మతిరిగిపోయారు. దీని కంతటికీ కారణం సూరయ్య అధికార దుర్వినియోగమనీ, ఎన్నికల్లో డబ్బు విచ్చలవిడిగా పంచిపెట్టడమనీ, అవినీతి మార్గాలు తొక్కడమనీ ఏవేవో శకాలుగా కుర్రకారు ప్రచారం చేశారు. ఆ ప్రచార సమాచారమంతా సూరయ్య చెవిన సోకింది. ఖద్దరు కండువాను సవరించుకుంటూ తన మెంబర్లలో ఒకనితో ఇట్లా అన్నాడు సూరయ్య.

"అనుభవంలేని కుర్రకుంకలు. రాజకీయమనేది కాలేజీల్లో చదువుకుంటే వంటబట్టదు. ఈ ప్రజాస్వామ్యంలో సిద్ధాంతాలు వేరు; ఆచరణలు వేరు. అది తెల్సుకోకుండా హనుమంతుని ముందు కుప్పిగంతులు వేస్తే ఏం లాభం?"

సూరయ్య అయిదోసారి ఆ వూరికి ఏకగ్రీవంగా సర్పంచ్ అయ్యాడు.

*రాజకీయమంటే మర్రిచెట్టులా నలుమూలలకూ విస్తరించాలి గానీ, కొబ్బరిమొక్కలా గాలిలో పెరిగిపోవడం కాదు.*